

# ’అదే’ కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 70

## ఎంబసీ, కాన్సులేట్

**ఆ మధ్యన ఎప్పుడో** అమెరికా వచ్చిన సూర్యనారాయణ తన పాస్ పోర్ట్ ఎప్పుడు ఎక్స్పైర్ అయిపోయిందో చూసుకోలేదు. ఇంకా చాలా కాలం ఉంది కదా అనుకుని ఎక్కడో పెట్లో పెట్టిన ఈ ఇండియన్ పాస్ పోర్ట్ గురించి మర్చిపోయేడు. తర్వాత ఎప్పుడో చూసుకున్నా బాగుండేది కానీ ఇలా పీకలమీదకి వస్తుందనుకోలేదు, అదైనా తండ్రి అర్జంట్ గా ఇండియా రమ్మని ఫోన్ మీద చెప్పేదాకా. అక్కడ ఎవరికైనా వంట్లో బాగుందో లేదో తెలియదు. ఎంత రెట్టించినా నువ్వు అర్జంట్ గా రావాలి అని తప్ప మరోమాట చెప్పడం లేదు తండ్రి. అప్పుడు చూసుకుంటే సూన్నాణ పాస్పోర్ట్ చచ్చిపోయి, అదే ఎక్స్ పైర్ అయ్యి ఆరునెలలైంది. నాలిక కరుచుకుని ఇంటర్నెట్ మీద పడ్డాడు ఏం చేయాలో చూడ్డానికి. అది మొదటి అడుగు; ఆ తర్వాత తెలిసి వచ్చినవి అనేకానేక విషయాలు.

ఎమర్జన్సీ పాస్ పోర్ట్ కావాలన్నా కాన్సులేట్ వారి ఆఫీసుకి డ్రైవ్ చేసుకుని వెళ్ళిపోవడం కుదరదు. ఫలానా వారికి ఫోన్ చేయండి లేదా ఇక్కడ కి ఈమెయిల్ పంపగలరు. వీలు బట్టి “అతి త్వరలో” మేము సమాధానం ఇస్తాం. హతోస్మి, ఇది ఎమర్జన్సీ ఎలా అయింది గురువా? మరోచోట, వీసా, పాస్ పోర్ట్ అప్లికేషన్లు మరో కంపెనీ వారికి మార్చబడినవి;

కాన్సులేట్ కి వచ్చి మమ్మల్ని ఏడిపించకండి. కిందన మిగతా విషయాలు గమనించగలరు – వీసా ఫీజు ఇంత, మేము ఇవన్నీ బయట కంపెనీకి ఇచ్చాం కనక వారి ఫీజు వేరే, ఇంకా ఇండియన్ కమ్యూనిటీ వెల్ ఫేర్ ఫండ్ అనేదానికి కూడా మీరు ఫలానా ఇంత అని చచ్చినట్టు కట్టుకోవాలి, వగైరా వగైరా. "ఇండియన్ కమ్యూనిటీ వెల్ ఫేర్ ఫండ్" అంటే ఏమిటండి, అదేం చేస్తుంది అనే గూట్లే ప్రశ్నలు వేస్తున్నారా మళ్ళీ? ఊరుకోండి అది మూడు డాలర్లు మాత్రమే. దానికే ఏడిస్తే ఎలా? సరే, సరే, సరే.....

ఇంకా ఉన్న రూల్స్ ప్రకారం కాన్సులేట్ వెబ్ సైట్ ఇలా చెప్తోంది. ఫలానా ఈ శుక్రవారం మూడు గంటల్నుంచి అన్ని సర్వీసులూ బంద్. మేము 'ఈ మరో కంపెనీ' మార్చాము; కొత్త కంపెనీ వారి కాంట్రాక్ట్ ఇంకా పూర్తి కాలేదు కనక మరో నోటీస్ ఇక్కడ వెబ్ సైట్లో పెట్టేవరకూ మీరు ఎవరికి ఏమి పంపినా, లేట్ అయినా, ముందే పంపినా మాకు సంబంధం లేదు. మమ్మల్ని ఫోన్ చేసి మా సమయం తగలేయకండి.

ఇదేమిటి మరి సూన్నాణ పాస్ పోర్ట్ ఎలా? మీరు పాస్ పోర్ట్ ఎప్పుడు చచ్చిపోతుందో చూసుకోకపోతే అది కాన్సులేట్ తప్పు ఎలా అవుతుంది? తిక్క కుదిరిందా? అబ్బే, ఇంకా ఉంది ఈ కింది రోజుల్లో మా కాన్సులేట్ మరియు ఎంబసీ మూసి వేయబడుతుంది భారత, అమెరికా దేశాల శెలవులకి, గమనించగలరు. సూర్యనారాయణ ఆ శెలవు రోజులేవిటో చూడబోయేడు. రిపబ్లిక్ డే, హోలీ, గురునానక్ జన్మదినం, అమెరికా వారి గణతంత్ర దినోత్సవం, ఇండియావారి స్వాతంత్ర దినోత్సవం, ఈమధ్యనే కొత్తగా పెట్టిన జూన్ టీంత్, దీపావళి, దసరా, థేంక్స్ గివింగ్, క్రిస్టమస్ ఇలా రెండు దేశాల రోజులూ కలిపి దాదాపు ఇరవై మూడు రోజులు శెలవు. అయ్యా నేను పని చేసే చోట ఏడాదికి పన్నెండు శెలవులు ఇస్తే గొప్ప మరి ఇలా చేయొచ్చా కాన్సులేట్ వారూ? దానికి సమాధానం చాలా ఈజీ వీజీ. మేము ఎందుకిలా పెట్టామంటే అటు ఇండియాలో అమెరికా కాన్సులేట్ వారు కూడా ఇండియా అమెరికా శెలవులు రెండూ వాడుకుంటారు. వాళ్లకి కూడా విచిత్రమైన శెలవులున్నై; కావాలిస్తే వెబ్ సైట్ చూసుకోండి.

ఇంతవరకూ వచ్చింది కనక సూర్యనారాయణ అలా అమెరికన్ కాన్సులేట్ వెబ్ సైట్ కి వెళ్ళి చూసాడు వాళ్ల శెలవులు. అమ్మో వాళ్ళు మరింత ఘటికులు కాదూ? వాళ్ళు ఈ ఇరవై మూడులో మరిన్ని చేర్చారనడానికి ఆధారంగా ఆయుధ పూజ, ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి, గాంధీ జయంతి, అన్ని మతాలనీ కలుపుకోవాలి కనక ఇద్– ఉల్–ఫితర్ బక్రీద్, కృష్ణాష్టమి వగైరా. మిగతా థేంక్స్ గివింగ్, క్రిస్టమస్ అవన్నీ యధావిధిగా ఎలాగా ఉన్నై.

'ఇదేమిటోయ్' అంటే సమాధానం 'అది అంతేనువోయ్!' కదా. అరచేతిలో మీరు చూపుడు వేలు అయితే మేము చిటికెన వేలు. మీరేం చేస్తే మేమూ అదే చేస్తాం, మేమేమైనా తక్కువ తిన్నామా? ప్రశ్నలు అడగడం మానేసి ఇప్పుడైనా నోరు మూసుకుంటారా లేదా?

సూర్యనారాయణ ఫోన్ చేస్తే సమాధానం విసురుగా వస్తోంది – "చెప్పాం కదా ఫోన్ చేయద్దని, ఎందుకు మమ్మల్ని ఏడిపిస్తారు" అంటూ. ఈ విసురు కూడా ఆటోమేటెడ్ ఆన్సర్లు అన్నీ దాటుకుని గంట ఫోన్ మీద వెయిట్ చేసాక.

మొత్తానికి కాన్సులేట్ లో తేలి కాస్త మెల్లిగా బతిమాలుతున్నట్టు మాట్లాడుతూ సమాధానం సేకరించబోతే తాను దేశం నుంచి వచ్చాడని తెలియగానే పెదాల మీద నవ్వు అనేది కనిపించకుండా సమాధానం చెప్పడం, పోయి ఆ మూడో కంపెనీ వారి దగ్గిర అప్లికేషన్ పెట్టండి అనడం. దేశం చూడ్డానికి బాగుంటుందనీ, అక్కడ జనం అందర్నీ అతిధిదేవోభవ అన్నట్టు పలకరిస్తారనీ విని వీసా కోసం వచ్చే అమెరికా తెల్ల చర్మం వారితో నవ్వుతూ మాట్లాడే మన కాన్సులేట్ వారికో ప్రశ్న– "అమ్మా అయ్యా, మేము మీలాంటి మనుషులమే కదా? మేమూ డాలర్లే కడుతున్నాం ఫీజుకింద. అయినా మన దేశం చర్మం చూసేసరికి మొహం అలా చిటపటలాడించుకుంటారేం?" ఏదీ తేలలేదు సూన్నాణకి.

ఇంక చేసేదేం లేదు కనక సూర్యనారాయణ వీలు చూసుకుని పాస్ పోర్ట్ అప్లికేషన్ పెట్టాడు అవును ఆ వేరే కంపెనీ ద్వారానే. తర్వాత తండ్రితో చెప్పాడు తాను పాస్ పోర్ట్ ఎక్స్ పైర్ ఐతే మర్చిపోయిన ఘనకార్యం అవీ. మరో రెండు వారాలకి "ఎమర్జన్సీ పాస్ పోర్ట్" పట్టుకుని దేశం వెళ్ళాక తెల్సింది – తల్లికి వంట్లో బాగోలేదు. చిత్రగుప్తుల వారి వరకూ వెళ్ళి ఆయన అబ్బే ఇప్పుడు కాదు అంటే వెనక్కి వచ్చింది. ఇవన్నీ చెప్తే సూర్యనారాయణ కంగారు పడతాడని ఫోన్ మీద చెప్పలేదు. కోలుకున్న తల్లిని పలకరించి, ఓ వారం పోయాక వెనక్కి వచ్చిన సూర్యనారాయణ చేసిన మొదటి పని ఇంట్లో అందరి పాస్ పోర్ట్ లూ తనిఖీ చేసి వెంతనే అందరికీ అప్లికేషన్ లు పెట్టడం. అవి అయ్యేసరికి మరో ఆరువారాలు. సర్వేజనాః సుఖినోభవంతు. అయితే నిజంగా తల్లో/తండ్రో లేదా అతి ముఖ్యమైన మరో వ్యక్తో పోయి ఉంటే ఏమై ఉండేది? అదీ ఏ శెలవు రోజుల్లోనో అయితే? ఇది ఆలోచించబోయేసరికే సూర్యనారాయణ వెన్ను వణికింది.

నీతి: చూపుడు వేలుకు చిటికెన వేలు ఎంతదూరమో చిటికెన వేలుకు చూపుడు వేలు అంతే దూరం

Post your comments